సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 6 । జూలై । 2025

గరిష్ఠం/కనిష్ఠం
34.6 /22.6

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అడపాదడపా వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఉత్తమ సొసైటీగా ఉత్తునూర్



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ఉత్తునూర్ సొసైటీ ఉత్తమ సొసైటీగా ఎంపికైంది. గత పది సంవత్సరాల నుంచి దీర్ఘకాలిక రుణాలు రూ.3 కోట్ల 5 లక్షలు వసూలయ్యాయి. విండో చైర్మన్ కాట్మండి ప్రభాకర్‌రావు, సీఈవో నహీంను గ్రామస్తులు, రైతులు అభినందించారు. 2024–2025 ఆర్థిక సంవత్సరంలో కామారెడ్డి జిల్లాలో ఐదో స్థానంలో ఉన్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా విండో చైర్మన్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. సొసైటీల ద్వారా రైతులు పొందిన రుణాలు సకాలంలో తిరిగి చెల్లించి రైతు సహకార సంఘాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాంచందర్ రావు, నిట్టూరి వెంకట్ రావు, డీకే రావు, శివాజీరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సాహిత్యం ఎంతో గొప్పది



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి జిల్లా సాహిత్యం ఎంతో గొప్పదని, సాహితీవేత్తల కృషి అభినందనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రచయితల వేదిక (తెరవే) జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్, ప్రతినిధులు శనివారం చంద్రకాత్‌రెడ్డిని సన్మానించి తెరవే జిల్లా కవులు, రచయితల పుస్తకాలను గ్రంథాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. జిల్లా సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలకు గ్రంథాలయాల్లో ప్రత్యేక చోటు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తెరవే ప్రతినిధులు మంద పీతాంబర్, బి నాగభూషణం, కాసర్ల రామచంద్రం, కొడి రవీందర్, తిరుపతిరావు, గాయని సంధ్య, బానోత్ సురేశ్, లక్కీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి సహకరించాలి



కామారెడ్డి టౌన్: పట్టణ అభివృద్ధికి పట్టణ ప్రజలు సహకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్ అన్నారు. మున్సిపల్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి పట్టణంలో శనివారం చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. ప్రజలు, వ్యాపారులు చెత్తను రోడ్లపై, మురికి కాలువల్లో వేయకుండా చెత్తసేకరణ ఆటోలకు ఇవ్వాలని కోరారు. సకాలంలో ఆస్తి, కులాయి పన్ను చెల్లించాలన్నారు. శానిటేషన్, తాగునీరు, తదితర సమస్యలుంటే నేరుగా మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, శానిటరీ ఎస్సై ఫర్వేజ్, జవాన్‌లు ఉన్నారు.

విఠల విఠల



- పాండురంగని దర్శనం కోసం పండరీపూర్‌కు..
- జిల్లా నుంచి 'దిండి' పాదయాత్ర
- తొలిఏకాదశి రోజున దర్శనంతో పులకించనున్న భక్తులు
- దశాబ్దాలుగా వెళ్తున్న భక్తులు ఎందరో..
- అక్కడికి వెళ్లలేనివారు జిల్లాలోని బైరాపూర్ గుడికి..

సండే స్పెషల్

పుండరీకుడు తన తల్లిదండ్రులకు చేస్తున్న సేవను చూస్తూ ముగ్ధుడైన ఆ మహావిష్ణువు (పాండురంగడు) రెండు చేతులు నడుముకు పెట్టుకుని ఇటుకపై అలానే నిల్చుండిపోయాడు. విఠోబ.. విఠలేశ్వరుడు.. పాండురంగడు ఏ పేరుతో పిలిచినా స్వామి పలుకుతాడని భక్తుల నమ్మకం. ఆ నమ్మకమే ప్రతి ఏడాది భక్తులను పండరీపురానికి నడిపిస్తోంది. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా జిల్లా నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో 'దిండి'గా తరలివెళ్లారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : మహారాష్ట్రకు సరిహద్దుల్లో ఉన్న కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని పలు మండలాల్లో విఠలేశ్వరుడిని వేలాది కుటుంబాలు పూజిస్తాయి. వారంతా ఆషాఢమాసంలో వచ్చే తొలి ఏకాదశి రోజున విఠలేశ్వరుడిని దర్శించుకుంటారు. మహారాష్ట్రలోని పండరీపూర్‌లో కొలువైన విఠలేశ్వరుడు, రుక్మిణీదేవి ఆలయానికి వేలాది మంది భక్తులు తరలి వెళ్తారు. ఉమ్మడి జిల్లాలోని మద్నూర్, జుక్కల్, డోంగ్లీ, పెద్ద కొడప్‌గల్, నిజాంసాగర్, బిచ్కుంద, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, గాంధారి, కోటగిరి, రుద్రూర్, వర్ని, పొతంగల్, బోధన్ తదితర మండలాల నుంచి ఏటా తొలి ఏకాదశికి పక్షం రోజుల ముందుగానే వేలాది మంది 'దిండి' పేరుతో పాదయాత్రగా బయలుదేరి వెళ్తారు. 320 కిలోమీటర్ల నుంచి 400 కిలోమీటర్ల మేర పాదయాత్రగా వెళ్లి దర్శనం చేసుకుంటారు. వేలాది మంది రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్లి తొలి ఏకా దశి రోజు పండరీపూర్‌కు చేరుకుని స్వామిని దర్శించుకుంటారు. దారి పొడవునా స్థానికులు 'దిండి'గా వెళ్తున్న భక్తులకు భోజన సౌకర్యం కల్పిస్తారు. మరికొందరు వాహనాల్లో వెళ్తారు.

స్వామికి ఇంట్లోనే ఆలయం

మద్నూర్ మండల కేంద్రానికి చెందిన వట్నల్‌వార్ కృష్ణ, రుక్మిణీ దంపతులు పండరీపూర్ విఠలేశ్వరుని భక్తులు. ఏడాది క్రితం నూతన ఇంటిని నిర్మించుకున్న సమయంలో ఇంట్లో విఠలేశ్వరునికి గుడి కట్టించుకున్నారు. మూడు అడుగుల ఎత్తుతో ఉన్న విఠలేశ్వర స్వామి విగ్రహాన్ని తయారు చేయించి ఇంట్లోని గుడిలో ప్రతిష్ఠించారు. నిత్యం స్వామివారికి వస్త్రాలంకరణసేవ, నైవేద్యం, అర్చనలు చేస్తారు. తొలి ఏకాదశి రోజున పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తారు. పండరిపూర్ ఆలయంలో కొనసాగే పూజా విధానా న్నే తన ఇంట్లోని ఆలయంలో పాటి స్తారు.



బైరాపూర్‌లో విఠలేశ్వరుడు

నస్రుల్లాబాద్ మండలం బైరాపూర్‌లో కొలువైన విఠలేశ్వరస్వామి ఆలయానికి కూడా తొలి ఏకాదశి రోజున వేలాది మంది భక్తులు తరలివస్తారు. పండరిపూర్‌కు వెళ్లలేని వాళ్లంతా ఇక్కడికి వచ్చి దర్శనం చేసుకుంటారు. దర్శనానికి వచ్చిన భక్తులకు స్థానిక ఆలయ నిర్వాహకులు అన్నదానం చేస్తారు. బైరాపూర్ ఆలయానికి కూడా వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. తొలి ఏకాదశి రోజున బైరాపూర్ ఆలయం జనంతో కిక్కిరిస్తోంది.



పండరీపూర్‌కు పాదయాత్రగా వెళ్తున్న భక్తులు



హిప్పర్గ నుంచి పాదయాత్రగా బైరాపూర్ విఠలేశ్వర ఆలయానికి వెళ్తున్న భక్తులు

ఇరవై ఏళ్లుగా వెళ్తున్నా..



ఇరవై ఏళ్లుగా ప్రతి ఏడాది పండరిపూర్‌కు పాదయాత్రగా వెళ్తున్నా. విఠలేశ్వరుని అనుగ్రహంతో శక్తి ఉన్నన్ని రోజులు ఏటా తొలి ఏకాదశికి చేరుకునేలా పాదయాత్రగా వెళ్లి వస్తూనే ఉంటా. వేలాది మంది మా ప్రాంతం వాళ్లు పండరిపూర్‌కు వస్తారు.

– కొనింటి విఠల్, బిచ్కుంద

విఠలేశ్వరుడి అనుగ్రహంతోనే..



ప్రతి ఏడాది పండరిపూర్‌లోని విఠలేశ్వరుడిని దర్శించుకుంటా. కొన్నేళ్లుగా విఠలేశ్వర స్వామి వద్దకు వెళ్లి రావడం జరుగుతోంది. మాకు విఠలేశ్వరుడే అన్నీ. స్వామిని నమ్ముకున్నోళ్లకు ఏలోటు ఉండదు. అంతా స్వామిదయ. ఇరవై ఐదేళ్లుగా వెళ్తున్నా.

– సంగాయప్ప స్వామి, మద్నూర్

దైవచింతనలో ఉంటాం



విఠలేశ్వరుడిని నమ్ముకున్నం. నిత్యం దైవ చింతనలో ఉంటాం. పదిహేనేళ్లుగా క్రమం తప్పకుండా పండరిపూర్‌కు వెళ్లి దర్శనం చేసుకుని వస్తున్నాను. అంతా స్వామి నడిపిస్తున్నాడు. చేతనైనన్ని రోజులు వెళ్లి వస్తూనే ఉంటా.

– వెంకట్ మహారాజ్, మద్నూర్

నాలుగు దశాబ్దాలుగా వెళ్తున్నా



నేను సుమారు 41 ఏళ్లుగా పండరిపూర్‌కు వెళ్తున్నాను. విఠలేశ్వరుడి అనుగ్రహంతో ఇప్పటికీ క్రమం తప్పకుండా వెళ్లి వస్తున్నాను. అంతా స్వామి దయ. ప్రతి ఏడాది వెళ్లి వస్తాను. నాతోపాటు మా ఊరి వాళ్లు చాలా మంది వస్తారు.

– దార్పల్ సాయిలు, బిచ్కుంద

అమ్మాబాపు.. ఎట్లున్నరే..

- 'ఫోన్ మిత్ర'కు అపూర్వ స్పందన
- గురుకుల పాఠశాలల్లో ప్రారంభం



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న విద్యార్థి పవనపుత్ర

ఎల్లారెడ్డి: హలో.. అమ్మాబాపు ఎట్లున్నరే.. అంటూ గురుకుల విద్యార్థులు తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో సంతోషంగా ఫోన్‌లో మాట్లాడారు. 'ఫోన్ మిత్ర' కార్యక్రమంలో భాగంగా గురుకుల విద్యార్థులకు ఫోన్ సౌకర్యం శనివారం నుంచి అందుబాటులోకి వచ్చింది. హాస్టల్ విద్యార్థుల కోసం విద్యాశాఖ 'ఫోన్ మిత్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నలుగురు హాస్టల్ విద్యార్థులకు కలిపి ఒక స్మార్ట్ కార్డు ఇచ్చి వారి తల్లిదండ్రుల, సంరక్షకుల నంబర్లు ఫీడ్ చేశారు. ఈ కార్డు ద్వారా విద్యార్థి తమ కుటుంబసభ్యులతో ప్రతి రోజు 25 నిమిషాలపాటు మాట్లాడే అవకాశం ఉంటుంది. ఫోన్‌లో 5 నంబర్ డయల్ చేస్తే గురుకుల సొసైటీ కార్యదర్శికి వెళ్తుంది. హాస్టళ్లు, పాఠశాలల్లో తాము ఎదుర్కొంటున్న సమస్యలను విద్యార్థులు ఫోన్‌లో వివరించవచ్చు. ఎల్లారెడ్డి గురుకులంలో 8 ఫోన్లను వేసవి సెలవులల్లో ఏర్పాటు చేసినా శనివారం వాటికి కనెక్షన్ ఇచ్చారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలను పరిష్కరించాలి

- చట్టాలపై అవగాహన కల్పించాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

కామారెడ్డి క్రైం: గ్రామాల్లో 'సివిల్ రైట్స్ డే' కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తూ ఎస్సీ, ఎస్టీల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. శనివారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్‌చంద్ర, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ పాల్గొన్నారు. జిల్లా అధికారులతో కలిసి ఎస్సీ, ఎస్టీ భూములు, అట్రాసిటీ కేసులపై కమిషన్ సభ్యులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీల కోసం ఉన్న చట్టాలు, సంక్షేమ కార్యక్రమాలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసులను ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతినెల చివరి వారంలో సివిల్ రైట్స్‌డే ను, ప్రతి మూడు నెలలకోసారి డీవీఎంసీ సమావేశాన్ని నిర్వహించి సమస్యలను పరిష్కరించాలన్నారు. డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయడంతోపాటు జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి 30 గుంటల స్థలాన్ని కేటాయించినందుకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ను ప్రత్యేకంగా అభినందించారు. సమావేశానికి హాజరైన పలువురు జిల్లా వాసులు తమకు సంబంధించిన కేసులు, సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. కమిషన్ సభ్యులు నీలాదేవి, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, ఏఎస్పీ చైతన్యరెడ్డి, అధికారులు ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కనిపించని డ్రెయినేజీలు

- యథేచ్ఛగా ఆక్రమణలు.. వాటిపై నిర్మాణాలు
- జిల్లా కేంద్రంలో నాలాలపై పర్యవేక్షణ కరువు
- వానాకాలంలో రోడ్లను ముంచెత్తుతున్న వరద నీరు
- పట్టించుకోని బల్దియా అధికారులు

సాక్షి ఫోకస్ SAKSHI FOCUS

కామారెడ్డి టౌన్ : చిన్నపాటి వర్షం కురిస్తే కామారెడ్డి పట్టణంలోని రోడ్లన్నీ జలమయమవుతున్నాయి. భారీ వర్షాలు కురిస్తే రాకపోకలు నిలిచిపోయిన ఘటనలు ఉన్నాయి. దీనికి కారణం పట్టణంలోని ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఉన్న మురికి కాలువలను ఆక్రమణలకు గురి కావడమే.. పలు ప్రాంతాల్లో అసలు నాలాల జాడ కనిపించడం లేదు. కొన్ని చోట్ల ఇళ్ల యజమానులు డ్రెయినేజీలపై స్లాబ్‌లు వే సుకోగా.. మరికొన్ని చోట్ల వ్యాపారులు నాలాలను కబ్జా చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. వర్షపు, మురుగునీరు ప్రవహించేందుకు దారి లేకుండాపోయింది. బల్దియా పారిశుద్ధ్య కార్మికులు కాలువలను శుభ్రం చేద్దామన్నా చేసే పరిస్థితి లేదు. దీంతో డ్రెయినేజీలు వ్యర్థాలు, పూడికతో నిండిపోవడంతో మురుగు నీరు ముందుకు ప్రవహించడం లేదు. డ్రెయినేజీలను దాటి శాశ్వత నిర్మాణాలు చేపట్టినా అడిగేవారు లేకుండా పోయారు. బల్దియా అధికారుల పర్యవేక్షణ కరువైంది.

ఎక్కడ చూసినా..

కొత్తబస్టాండ్ నుంచి మున్సిపల్‌కార్యాలయం, నిజాంసాగర్ చౌరస్తా నుంచి హౌజింగ్‌బోర్డు వైపు వరకు ఇరువైపులా పూర్తిగా వ్యాపార సముదాయాలు, దుకాణాలు ఉన్నాయి. ఈ రోడ్ల వెంబడి మురికి కాలువల ఆనవాళ్లు లేకుండా స్లాబులు వేసి వాటిపై వ్యాపారాలు సాగిస్తున్నారు. నిజాంసాగర్ చౌరస్తా నుంచి దేవునిపల్లి వరకు ఇరు వైపులా ఇదే పరిస్థితి. ఇక స్టేషన్‌రోడ్, సిరిసిల్ల రోడ్, సుభాష్‌రోడ్, మాయాబజార్, నాజ్ టాకీస్‌రోడ్, గంజ్‌రోడ్, వీక్లీ మార్కెట్‌రోడ్, జన్మభూమిరోడ్, ఆర్‌కే లాడ్జ్ రోడ్, అశోక్‌నగర్ కాలనీ, పాత బస్టాండ్ నుంచి అడ్లూర్ రోడ్ తదితర ప్రాంతాల్లో డ్రెయినేజీల ఆనవాళ్లు కనిపించడం లేదు.

వానాకాలంలో అటువైపు వెళ్లలేం..

మురికి కాలువల ఆక్రమణలు, వాటిపై స్లాబ్‌లు వేయడంతో విద్యానగర్‌కాలనీ, నిజాంసాగర్ చౌరస్తా, పోలీస్ స్టేషన్ ముందు, పాత బస్టాండ్, సిరిసిల్లారోడ్, దేవునిపల్లిరోడ్, రామారెడ్డిరోడ్, అడ్లూర్‌రోడ్ తదితర ప్రధాన రహదారులపై రోడ్లు వర్షాకాలంలో జలమయమవుతున్నాయి. వాహనదారులు, పాదచారులు అటువైపు వెళ్లలేని పరిస్థితి ఉంది.



నిజాంసాగర్ రోడ్‌లో మురికి కాలువలపై వేసిన స్లాబ్

చర్యలు చేపడుతాం..



పట్టణంలోని ప్రధాన రోడ్లకు ఇరువైపులా మురికి కాలువలపై ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలిగించాలి. కాలువలపై స్లాబ్‌లు వేసుకుంటే తీసివేయాలి. మున్సిపల్ కార్మికులు డ్రెయినేజీలను శుభ్రం చేసేలా ఉండాలి. లేకుంటే ఇళ్ల యజమానులపై చర్యలు తీసుకుంటాం. మురికి కాలువలపై ఆక్రమణలను తొలగింపు చర్యలు చేపడతాం.

– రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి



కొత్త బస్టాండ్ పక్కన మురికి కాలువపై నిర్మాణాలు



మున్సిపల్ కార్యాలయం పక్కనే..



సిరిసిల్ల రోడ్‌లో జలమయమైన రోడ్డు (ఫైల్)

క్లుప్తంగా

నిషేధిత ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తాం



ప్లాస్టిక్ కవర్లను పరిశీలిస్తున్న కమిషనర్ రాజేందర్‌రెడ్డి

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలో వ్యాపారులు నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, బ్యాగులను విక్రయించినా, వినియోగించినా దుకాణాలను సీజ్ చేస్తామని మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలో కొత్తబస్టాండ్, సుభాష్‌రోడ్, సిరిసిల్లారోడ్‌లలో వ్యాపారదుకాణాలు, హోటళ్లను తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో నిషేధిత కవర్లు వినియోగించడంతో యజమానులకు జరిమానాలు విధించారు. విక్రయిస్తున్న కవర్లు, క్యారీ బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సానిటరీ ఎస్‌ఐ పర్వేజ్, జవాన్‌లు పాల్గొన్నారు.

బీసీలకు యూపీఎస్సీ లాంగ్‌టర్మ్ ఉచిత కోచింగ్

కామారెడ్డి అర్బన్: యూపీఎస్సీ సివిల్స్‌కు ఉచిత లాంగ్ టర్మ్ (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) కోచింగ్ కోసం అర్హులైన బీసీ అభ్యర్థుల నుంచి ఈనెల 8వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బి.స్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసిన వారికి ఈనెల 12న ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందని, ఎంపికైన వారికి 25 నుంచి వచ్చే సంవత్సరం ఏప్రిల్ 30 వరకు హైదరాబాద్‌లోని సైదాబాద్ లక్ష్మినగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

నమ్మించి మోసం చేసిన యువకుడిపై కేసు

మోపాల్: మండలంలోని ముదక్‌పల్లికి చెందిన ఓ మహిళను మోసం చేసిన అస్మత్ ఖాన్ అనే యువ కుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ శనివారం తెలిపారు. అస్మత్ ఖాన్, గ్రామానికి చెందిన సదరు యువతి గత కొంతకాలంగా ప్రే మించుకుంటున్నారు. అతడు పెళ్లి చేసుకుంటానని తెలపడంతో శారీరకంగా దగ్గరయ్యారు. చివరకు ఆమె గర్భం దాల్చడంతో మాటమార్చాడు. దీంతో బాధిత మహిళ తనను పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆదర్శం.. చిన్నకొడప్గల్ సొసైటీ

- దీర్ఘకాలిక రుణాల వసూళ్లలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రథమ స్థానం
- అప్పులు చెల్లించేలా అవగాహన కల్పిస్తున్న సొసైటీ సిబ్బంది


చిన్నకొడప్గల్ సొసైటీ కార్యదర్శి హన్మాండ్లును సన్మానిస్తున్న అధికారులు (ఫైల్)

పిట్లం(జుక్కల్): దీర్ఘకాలిక రుణాల వసూళ్లలో 2024–25 సంవత్సరంలో చిన్నకొడప్గల్ సొసైటీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచింది. దీర్ఘకాలిక రుణాల వసూళ్లలో సొసైటీ 45 శాతం రుణాలు వసూళ్లు చేసింది. నిజామాబాద్‌లోని ఎన్‌డీసీసీ సెంట్రల్ బ్యాంక్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు చిన్నకొడప్గల్ సొసైటీ కార్యదర్శి హన్మాండ్లును ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. చిన్నకొడప్గల్ సహకార సంఘం పరిధిలో 8 గ్రామాలు ఉన్నాయి.సహకార సంఘంలో మొత్తం 4,300 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు.ఇందులో 3,476 మంది రైతులకు సభ్యత్వం ఉండగా,ఇందులో 3,195 మంది రైతులు స్వల్పకాలిక, 281 మంది రైతులు దీర్ఘ కాలిక రుణాలు తీసుకున్నారు. దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతులకు రుణం వడ్డీలో 40 శాతం రాయితీ వస్తుందని బ్యాంక్ సిబ్బంది ద్వారా,మహాజన సభలలో సొసైటీ సిబ్బంది అవగాహన కల్పించడంతో రైతులు రుణాలు చెల్లించడానికి ముందుకు వచ్చారు.సొసైటీ పరిధిలో 281 మంది రైతులకు రూ.8 కోట్ల దీర్ఘ కాలిక రుణాలు తీసుకున్నారు. ఇందులో 2024– 25 సంవత్సరంలో 180 మంది రైతుల వద్ద నుంచి రూ. 3 కోట్ల 80 లక్షల రుణాలు వసూళ్లు చేసి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఆదర్శంగా నిలిచింది. సొసైటీ సిబ్బంది రైతులకు సకాలంలో పంట రుణాలు, ఎరువులు, విత్తనాలు అందిస్తున్నారు. సి బ్బంది రుణగ్రహీతలకు అవగాహన కల్పించి సమయానికి అప్పులు చెల్లించేలా కృషి చేస్తున్నారు.

కర్షక మిత్ర రుణాలు ఇప్పించాం



దీర్ఘ కాలిక రుణాల వసూళ్లలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సొసైటీ మొదటి స్థానంలో నిలవడంతో సంతోషంగా ఉంది. దీర్ఘ కాలిక రుణాలు తీసుకున్న రైతుల ఇళ్లకు స్వయంగా వెళ్లి రుణాలు చెల్లించాలని అవగాహ కల్పించా. సంఘంలోని 20 మందికి కర్షక మిత్ర రుణాలు ఇప్పించా.

– నాగిరెడ్డి, సొసైటీ చైర్మన్, చిన్నకొడప్గల్

రైతులకు అవగాహన కల్పించాం




రుణాల వసూళ్ల కోసం జిల్లా అధికారులు, బ్యాంక్ అధికారుల సహాయంతో సంఘం పరిధిలోని గ్రామాలలో రుణాలు చెల్లిస్తే వడ్డీలో 40 శాతం రాయితీ వస్తుందని రైతులకు అవగాహన కల్పించాం. రుణాల రికవరీలో సహకరించిన సిబ్బందికి, జిల్లా అధికారులకు కృతజ్ఞతలు.

– హన్మాండ్లు, సొసైటీ కార్యదర్శి, చిన్నకొడప్గల్

గ్రామ కంఠం అంటే..

మీకు తెలుసా?



బాల్కొండ: గ్రామ కంఠం అనేది ఒక గ్రామంలో నివాసాల కోసం కేటాయించిన భూమిని తెలియజేస్తుంది. గ్రామంలోని ఉమ్మడి స్థలం. ఈ స్థలంలో ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించబడుతాయి.

- గ్రామ కంఠం భూమిని వారసత్వంగా అనుభవించాల్సిందే తప్ప ఇతరులకు అమ్మడం, లేదా బదలయించడం కుదరదు.
- భూమిలో నివసించే ప్రజలకు ఆ భూమిపై పూర్తి హక్కులు ఉండవు. కాని వారు దానిని అనుభవించవచ్చు.
- గ్రామ కంఠం భూమిని ప్రభుత్వం అవసరమైతే స్వాధీనం చేసుకుంటుంది. లేదా ఇతర అవసరాలకు ఉపయోగించుకుంటుంది.
- గ్రామ కంఠం భూములను రెవెన్యూ శాఖ నిర్వహిస్తుంది. అవసరమైన పత్రాలను జారీ చేస్తుంది.

భూభారతి దరఖాస్తులు త్వరగా పూర్తి చేయాలి


పెద్దకొడప్‌గల్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను నెలరోజులలోపు పరిష్కరించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి.. రెవెన్యూ దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మండలంలో జరిగిన రెవెన్యూ సదస్సులో 499 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా వాటిలో 152 మందికి నోటీసులు అందజేశామని, మిగిలిన వాటిలో చాలా వరకు అటవీశాఖకు చెందిన దరఖాస్తులే వచ్చాయని తెలిపారు. నూతనంగా మండలంలో విలీనమైన బాబుల్ గావ్ గ్రామస్తులు రెవెన్యూ సమస్యలు పరిష్కారం కావడం లేదని సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. సమస్యను ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులతో సబ్‌కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ్, నాయబ్ తహసీల్దార్ రవికాంత్,ఆర్‌ఐ అంజయ్య రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కేవీ కోసం స్థల పరిశీలన

మద్నూర్: మండల కేంద్రంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అధికారులు ఎంపిక చేసిన స్థలాన్ని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, కేంద్రీయ విద్యాలయ రాష్ట్ర కమిషనర్ మంజూనాథ్ శనివారం పరిశీలించారు. మద్నూర్‌లో కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించేందుకు తాత్కాలిక భవనంతోపాటు శాశ్వత భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపిస్తున్నామన్నారు. వారివెంట డీఈవో రాజు, తహసీల్దార్ ముజీబ్, మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పదోన్నతులు బాధ్యతను పెంచుతాయి

- నిజాయితీగా ప్రజలకు సేవలు అందించాలి
- ఎస్పీ రాజేశ్ చంద్ర


ఎస్పీని కలిసిన పదోన్నతి పొందిన పోలీసులు

కామారెడ్డి క్రైం: పదోన్నతులు బాధ్యతను పెంచుతాయని ఎస్పీ రాజేశ్ చంద్ర అన్నారు. పదోన్నతి పొందిన అధికారులు రెట్టింపు ఉత్సాహంతో విధులు నిర్వహిస్తూ నిజాయితీగా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. జిల్లా లోని ఆయా పోలీస్ స్టేషన్ లలో విధులు నిర్వహిస్తున్న 13 మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. వారందరూ శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాజేశ్ చంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పదోన్నతి చిహ్నాలను ఎస్పీ అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సీనియారిటీ ప్రకారం అందరికీ ప్రమోషన్ లభిస్తుందన్నారు. విల్లింగ్ స్టేషన్లు, సీనియారిటీ, దంపతుల సేవలు, ఆరోగ్య పరిస్థితులు, సర్వీస్ రికార్డులు తదితర అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని బదిలీలు జరుపుతామన్నారు.

పదోన్నతి పొందిన అధికారుల వివరాలు..

కానిస్టేబుళ్లుగా పని చేస్తున్న రామేశ్వర్ రెడ్డి (లింగంపేట్) మధుకర్ (ఎల్లారెడ్డి), దేవేందర్ (లింగంపేట్), బిఎం.రాజు (దేవునిపల్లి), సిహెచ్. సాయిలు (బిచ్కుంద), జి. రాజు కుమార్ (బిచ్కుంద) ప్రిన్స్ బాబు (వీఆర్), అనిల్ కుమార్ (రాజంపేట), రామారావు (మాచారెడ్డి), సీహెచ్ స్వామి (మాచారెడ్డి), సీహెచ్ శ్రీనివాస్ (నాగిరెడ్డిపేట్), సీహెచ్ మహేందర్ (వీఆర్) సంజీవులు (దేవునిపల్లి) లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించినట్లు ఎస్పీ తెలిపారు.

నేటి ర్యాలీని జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండల కేంద్రం నుంచి పిట్లం వరకు చేపట్టిన ద్విచక్రవాహన ర్యాలీని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పుట్టిన రోజును పురస్కరించుకొని ర్యాలీ, అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. నాయకులు లోక్యానాయక్, రమేష్‌యాదవ్, తోట. రాజు, సాయాగౌడ్, శంకర్ తదితరులున్నారు.

వాహనాల తనిఖీ

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని అంజనీ చౌరస్తా జాతీయ రహదారి 161పై శనివారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు.

సంక్షిప్తం

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి


సమ్మె నోటీసు అందిస్తున్న కార్మికులు

దోమకొండ: తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం దోమకొండ దేశాయి బీడీ కంపెనీ మేనేజర్‌కు సమ్మె నోటీసును అందజేసినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్దిరాములు తెలిపారు. బహుజన వామపక్ష కార్మిక సంఘాల భాగస్వామ్య కార్మిక సంఘాలు జేఏసీల ఆధ్వర్యంలో జూలై 9న జరిగే జాతీయ సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నాగారపు ఎల్లయ్య, ప్రతినిధులు శంకర్, మారుతి,నర్సింలు, తదితరులు పాల్గొన్నారు,

గిరిజన మండల కార్యవర్గం ఎన్నిక

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నట్లు కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాథోడ్ సురేందర్ తెలిపారు. మండల కేంద్రంలోని బంజారా సేవా సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జాదవ్ దేవీదాస్, గౌరవ అధ్యక్షుడి మెగావత్ గోపాల్, ఉపాధ్యక్షులు మాలోత్ భద్రు, మాలోత్ భీమా, దేవసోత్ దేవిసింగ్, ప్రధాన కార్యదర్శి దేవసోత్ సర్వన్, సహాయ కార్యదర్శులుగా బదావత్ నౌషా, బదావత బలరాం, రమావత్ విజయ్, రమావత్ పాండు, కోశాధికారి బానోత్ మోతీరాంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బనావత్ శ్రీనివాస్, మోతీసింగ్, ఆయా తండాలకు చెందిన గిరిజనులు పాల్గొన్నారు.

వితలేశ్వరాలయంలో ఏకాదశి ఉత్సవాలు ప్రారంభం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి వితలేశ్వరుడి ఆలయంలో శనివారం ఆషాఢ ఏకాదశి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల ఉత్సవాలలో భాగంగా వితలేశ్వరుడు, రుక్మిణి పాండురంగనికి ప్రత్యేకంగా అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి భక్తులు కాకడ హారతి, పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నాగభూషణం, ప్రణయ్ కుమార్ శర్మ తదితరులున్నారు.

ముస్తాబైన బైరాపూర్ వితలేశ్వర ఆలయం

బాన్సువాడ : తొలి ఏకాదశి పురస్కరించుకుని రుక్మిణి వితలేశ్వర ఆలయాలు ముస్తాబయ్యాయి. బీర్కూర్ మండలం బైరాపూర్ రుక్మిణి వితలేశ్వర మందిరానికి శనివారం నుంచే భక్తుల తాకిడి ప్రారంభమైంది. ఆలయ కమిటి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ధర్మకర్త ద్రోణవల్లి సతీష్ తెలిపారు.

ఒడ్డేపల్లిలో విద్యార్థికి డెంగీ

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని ఒడ్డేపల్లి గ్రామానికి చెందిన ఓ విద్యార్థికి వైద్య పరీక్షలు చేయగా డెంగీ వ్యాధి నిర్ధారణ అయిందని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు రోహిత్‌కుమార్ తెలిపారు. సదరు విద్యార్థి ఇంటి పరిసరాలను పరిశీలించి, నీటి నిల్వలను, చెత్తాచెదారాన్ని తొలగించామని ఆయన చెప్పారు. వ్యాధి ప్రబలకుండా క్లోరినేషన్, పారిశుద్ధ్య పనులు నిర్వహించమని పేర్కొన్నారు.

పార్థి గ్యాంగ్‌పై పీడీ యాక్టు నమోదు


పీడీయాక్టు ఉత్తర్వులు అందిస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: తరచుగా దారి దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతున్న పార్థి దొంగల ముఠాపై కామారెడ్డి పోలీసులు పీడీ యాక్టు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు శనివారం జారీ చేసినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. మహారాష్ట్రలోని వార్ధా జిల్లాకు చెందిన చొండా అలియాస్ కూలీ పవార్, జాకీ గుజ్జియా భోంస్లే, హరీష్ పవార్ అలియాస్ హర్ష, అనురాగ్ రత్నప్ప భోంస్లే పార్థి తెగకు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులు. ఈ ముఠా కామారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలోగల జాతీయ రహదారుల వెంబడి 9చోట్ల దారిదోపిడీలు, దొంగతనాలకు పాల్పడ్డారు. మారణాయుధాలతో రోడ్ల వెంబడి ఆగి ఉన్న వాహనాలను, అందులోని వ్యక్తులను టార్గెట్ చేస్తూ నేరాలకు పాల్పడుతుండేవారు. దీంతో శాంతి భద్రతల దృష్ట్యా వారిపై పీడీ యాక్టు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. కామారెడ్డి రూరల్ సీఐ రామన్ శనివారం నిజామాబాద్ సెంట్రల్ జైలుకు వెళ్లి అక్కడి జైలు అధికారులకు పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేశారు.

స్పీడ్ బ్రేకర్లతో దెబ్బతిన్న బస్సు



మాచారెడ్డి: మండల కేంద్రంలోని బస్టాండ్‌లోకి వెళ్లే రోడ్డుపై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల కారణంగా ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. వివరాలు ఇలా.. కరీంనగర్ నుంచి కామారెడ్డికి శనివారం ఆర్టీసీ ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సు బయలుదేరింది. మార్గమధ్యలో మాచారెడ్డి బస్టాండ్‌లోకి వెళ్తుండగా రోడ్డుపై ఉన్న స్పీడ్ బ్రేకర్ల మూలంగా బస్సు అదుపుతప్పింది. దీంతో బస్సు లగేజీ బాక్సుల డోర్లు ఊడి కిందపడ్డాయి. అలాగే పలువురు ప్రయాణికులకు స్వల్పంగా గాయలైనట్లు స్థానికులు తెలిపారు. గతంలో కూడా రెండుసార్లు ఇదే స్పీడ్ బ్రేకర్ల వద్ద ప్రమాదాలు జరిగి పలువురు గాయపడ్డారు. ఆర్టీసీ అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్ల ఎత్తు తగ్గించాలని పలువురు కోరుతున్నారు.

సెల్‌ఫోన్ చోరీకి యత్నం

నిజాంసాగర్(జుక్కల్): మండలకేంద్రంలో వారాంతపు సంతలో శనివారం ఓ దొంగ సెల్‌ఫోన్ చోరీకి యత్నించారు. అచ్చంపేట గ్రామానికి చెందిన ఒ కరు మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తుండగా ఫోన్ చోరీకి యత్నించాడు. వెంటనే బాధితుడు కేకలు వేయడంతో స్థానికులు అతడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. నిందితుడు ఫోన్ కింద పడేసి పరారయ్యాడు.

క్రైం కార్నర్

రెండు లారీలు ఢీ: ఒకరి మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రం సమీపంలో రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. జిల్లా కేంద్రానికి సమీపంలోని జాతీయ రహదారిపైగల రామారెడ్డి బ్రిడ్జి వద్ద శుక్రవారం రాత్రి ఓ లారీ సర్వీస్ రోడ్డులోకి వెళ్లి రివర్స్ తీసుకుంటుండగా నిజామాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న మరో లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఓంకారం పార్తీ (33) అక్కడికక్కడే మృతి చెందాడు. అఖిలేష్, మహేష్ అనే ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. గాయపడిన వారిని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి యువకుడు..


నరేశ్ మృతదేహం

నందిపేట్/డొంకేశ్వర్: పొలం దమ్ము చేస్తుండగా కేజ్‌వీల్స్ ట్రాక్టర్ కింద పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన నందిపేట్ మండలం శాపూర్ శివారులో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. డొంకేశ్వర్ మండలం తొండాకూర్ గ్రామానికి చెందిన అవుట్ల నరేశ్(36) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఈ నెల 4న సాయంత్రం అతడు శాపూర్ శివారులోని అల్లూరి ప్రదీప్ రెడ్డికి చెందిన పొలాన్ని దమ్ము చేయడానికి వెళ్లాడు. ఈక్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి పొలంలో ఉన్న కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్‌పై ఉన్న నరేశ్ బురదలో పడిపోగా కేజ్‌వీల్ అతని పైనుంచి వెళ్లింది. వెంటనే స్థానికులు గమనించి వచ్చి చూసేసరికి నరేశ్ మృతిచెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నరేశ్ భార్య పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసున్నామని ఏఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక కొడుకు ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలో ఇటీవల ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా.. నగరంలోని పూలాంగ్‌కు చెందిన మల్లెపూల సందీప్(36), రవికుమార్ కలిసి కార్పెంట్ షాపు నిర్వహించగా నష్టాలు రావడంతో అప్పులపాలయ్యారు. ఆర్థిక ఇబ్బందులు కలగడంతో సందీప్ మనస్తాపం చెంది శుక్రవారం సాయంత్రం చెదల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతడు భార్యకు సమాచారం అందించడంతో వెంటనే కుటుంబసభ్యులు అతడిని గుర్తించి, చికిత్స నిమిత్తం ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

స్పెషల్ డ్రైవ్‌లో 130 సెల్‌ఫోన్‌ల రికవరీ


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర

కామారెడ్డి క్రైం: స్పెషల్ డ్రైవ్ ద్వారా 15 రోజుల వ్యవధిలో జిల్లాలో 130 సెల్‌ఫోన్‌లను రికవరీ చేసినట్లు ఎస్పీ రాజేశ్‌చంద్ర తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. పోగొట్టుకున్న, చోరీకి గురైన సెల్‌ఫోన్‌లను రికవరీ చేశామని, వాటి విలువ సుమారు రూ.17లక్షలు ఉంటుందని తెలిపారు. సెల్‌ఫోన్‌లు చోరీకి గురైనా, పోగొట్టుకున్నా ఆందోళనకు గురికావొద్దని, సీఈఐఆర్ విధానంలో రికవరీ చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సెల్‌ఫోన్‌ల రికవరీలో రాష్ట్రం లోని కమిషనరేట్‌లను మినహాయిస్తే కామారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతోపాటు భద్రతా కారణాల దృష్ట్యా వెంటనే సిమ్‌కార్డును బ్లాక్ చేయించాలని సూచించారు. ఆలస్యం చేస్తే వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలిగే అవకాశం ఉంటుందన్నారు. సెల్‌ఫోన్‌ల రికవరీలో ప్రతిభ కనబర్చిన బృందం సభ్యులను ఎస్పీ అభినందించారు. రికవరీ అయిన ఫోన్‌ల వివరాలను బాధితులకు తెలుపుతామని, జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి ఆర్ఎస్సై బాల్‌రాజు (87126 86114)ను సంప్రదించి తీసుకువెళ్లాలని ఎస్పీ సూచించారు.

భర్తపై భార్య దాడి

- చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి


దేశ్యా నాయక్ (ఫైల్)

బోధన్‌రూరల్: భర్తపై భార్య దాడి చేయగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన బోధన్ మండలంలో చోటుచేసుకుంది. బోధన్ రూరల్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని మినార్‌పల్లి గ్రామానికి చెందిన దారావత్ దేశ్యా నాయక్ (57) కొంతకాలంగా వ్యసనాలకు బానిసై ఎలాంటి పని చేయకుండా జులాయిగా తిరిగేవాడు. ఈ విషయంలో అతడి భార్య సాలు బాయి, కొడుకు వసంత్‌ల మధ్య తరచూ గొడవలు వస్తుండేవి. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రం దేశ్యా నాయక్‌పై భార్య సాలు బాయి బలమైన ఇనుప రాడుతో దాడికి పాల్పడింది. ఈ ఘటనలో దేశ్యా నాయక్ తీవ్రంగా గాయపడగా స్థానికులు, కొడుకు అతడిని చికిత్స నిమిత్తం బోధన్ జిల్లా ఆస్పత్రి తరలించగా, రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి అన్న కొడుకు గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. హత్యలో మృతుడి భార్యతో పాటు కొడుకు హస్తం కూడ ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొనగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మచ్చేందర్ రెడ్డి శనివారం తెలిపారు.

మీ కూతురు పోలీస్ స్టేషన్‌లో ఉందని ఫోన్

- రూ.25 వేలు డిమాండ్ చేసిన కేటుగాళ్లు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మీ కూతురు మా ఆధీనంలో ఉందని ఓ గుర్తుతెలియని వ్యక్తి కాల్ చేసిన ఘటన మండలంలోని కాటేపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా..మండలంలో కాటేపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ హైమద్‌కు శనివారం గుర్తుతెలియని నంబర్‌తో ఓ ఫోన్ కాల్ వచ్చింది. తాము కామారెడ్డి పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని, బోర్లంలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న మీ కూతురు మా ఆధీనంలో ఉందని వారు తెలిపారు. రూ. 25వేల ఇస్తే ఆమెను వదిలేస్తామని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు.

మోడల్ స్కూల్ విద్యార్థినులకు అస్వస్థత


వర్ని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

రుద్రూర్: మండలంలోని అంబం(ఆర్) శివారులో గల ఆదర్శ కళాశాల (మోడల్ స్కూల్/కళాశాల)లో పలువురు విద్యార్థినులు శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. వారంతా రాత్రివేళ ఒక్కసారిగా వాంతులు చేసుకుంటూ అస్వస్థతకు గురికావడంతో కేర్ టేకర్ సుజాత రుద్రూర్ పీహెచ్‌సీ సమాచారం అందించారు. మండల వైద్యాధికారిణి అయేషా సిద్ధికా, ఆరోగ్య సిబ్బంది హాస్టల్‌కు చేరుకుని ప్రథమ చికిత్స నిర్వహించారు. సుమారు 95మంది విద్యార్థినులు కడుపునొప్పితో ఇబ్బంది పడ్డారు. తీవ్ర అస్వస్థతతకు గురైన 8మంది విద్యార్థినులను వర్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. శనివారం సాయంత్రం నలుగురిని డిశ్చార్జ్ చేసినట్టు వైద్యాధికారిణి వెల్లడించారు. ఆరోగ్య సిబ్బంది ఇచ్చిన ఐరన్ మాత్రలను తినకముందు వేసుకోవడం వల్ల అస్వస్థత గురైనట్లు ఆమె వివరించారు.

వివాహిత ఆత్మహత్య

రుద్రూర్: పోతంగల్ మండలం కొడిచర్ల గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. కోటగిరి ఎస్సై సునీల్ తెలిపిన వివరాలు ఇలా. కొడిచర్లకు చెందిన మచ్కురి సుధాకర్‌కు ముఖేడ్ తాలూకా ఔరల్ గ్రామానికి చెందిన మహాదేవి(28)తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇటీవల మహాదేవి గర్భం దాల్చగా, అబార్షన్ అయింది. మనస్తాపానికి గురైన మహాదేవి శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి సామ్రాట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు.